సాక్షి జగిత్యాల

గురువారం । 15 । జూన్ । 2023



ఘనంగా బోనాల పండుగ

పెగడపల్లి : రాములపల్లి, ల్యాగలమర్రి గ్రామాల్లో బుధవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు.



ఆలయానికి భూమిపూజ

సారంగాపూర్ : మండల కేంద్రంలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి గౌడకులస్తులు బుధవారం భూమిపూజ చేశారు.

గరిష్టం/కనిష్టం
40.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి మెజిస్ట్రేట్‌గా ప్రసాద్



పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

మెట్‌పల్లి(కోరుట్ల): ఇటీవల ప్రారంభించిన సబ్ కోర్టు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్‌గా కె.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి తోపాటు పలువురు న్యాయవాదులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మెట్‌పల్లి, కోరుట్ల కోర్టుల పరిధిలోని సివిల్, క్రిమినల్ కేసులను సబ్ కోర్టులో అప్పీల్ చేసుకోవచ్చని మెజిస్ట్రేట్ తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఒజ్జెల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తెడ్డు ఆనంద్, కోశాధికారి సుమలత పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రచారం చేయాలి

జగిత్యాల: మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని బల్దియా కమిషనర్ నరేశ్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవంపై సమీక్షించారు. పట్టణాభివృద్ధి ఏ విధంగా జరిగింది, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టామనే విషయాలపై విస్తృత ప్రచారం చేయాలని నరేశ్ చెప్పారు. కార్యక్రమంలో డీఈ రాజేశ్వర్, మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సమావేశానికి హాజరైన సభ్యులు

మల్లాపూర్(కోరుట్ల): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు రావుల లింగారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన భారతీయ కిసాన్‌సంఘ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లామని, పాలకుల భాగస్వామ్యంతోనే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వాలు స్పందించకపోతే రైతుల పక్షాన పోరాడుతామని చెప్పారు. వానాకాలం పంటల కొనుగోలు కేంద్రాల క్యాలెండర్ నిర్ణయించాలని, బీమా బకాయిలను వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

టౌన్ సీఐ బదిలీ

జగిత్యాలక్రైం: జగిత్యాల టౌన్ సీఐ రాంచందర్ రావు మంగళవారం రాత్రి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కరీంనగర్ టౌన్-1 సీఐగా పనిచేస్తున్న సీహెచ్ నటేశ్‌ను నియమించారు. ఈమేరకు మల్టీజోన్-1 ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

పెగ్గెర్ల సర్పంచ్‌పై ఫిర్యాదు

కథలాపూర్(వేములవాడ): పెగ్గెర్ల సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు అదే గ్రామానికి చెందిన బాసారపు శంకర్ బుధవారం విలేకరులకు తెలిపారు. 2019 నుంచి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకుండానే నిధులు స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వరదకాలువ మట్టి అక్రమంగా తరలించి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేశారని పేర్కొన్నారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాసారపు శంకర్ చెప్పారు.

సాంగ్లీ మార్కెట్ సందర్శన



సాంగ్లీలో మార్కెట్ కమిటీ సభ్యులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్ కమిటీ పాలకవర్గం మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్, పండరీపూర్ పండ్ల మార్కెట్‌ను బుధవారం సందర్శించింది. కొనుగోళ్ల తీరుతోపాటు రైతులకు అందుతున్న మద్దతు ధరల గురించి అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన మార్కెట్ సాంగ్లీలో పసుపు పంటకు అందుతున్న ధర, రైతులకు కల్పించిన సదుపాయాల గురించి ఆరా తీశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ అసిఫొద్దీన్, రైతుబంధు సమితి కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు రాచకొండ విజయ్, జైరాం సురేశ్, పులిశెట్టి శ్రీనివాస్, అయిల్నేని ఆనందరావు, దయ్యాల మల్లారెడ్డి, గర్వందుల గంగయ్య, దుమాల రాజేశ్, జనగాం నరేశ్, వద్దురి లక్ష్మణ్, కొలగాని లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

తీరని దాహం

ధర్మపురి: ప్రముఖ పుణ్యక్షేత్రం.. రోజూ వేలాది మంది భక్తులు వచ్చిపోతుంటారు.. తలాపునే పవిత్ర గోదావరి నది ఏడాది పొడవునా పారుతూ ఉంటుంది.. మరోవైపు.. పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి పనులు చేపడుతోంది.. లోపం ఎక్కడుందో కానీ, ధర్మపురి బల్దియావాసులే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చే భక్తులు కూడా తాగునీటికి తిప్పలు పడుతున్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో తాగునీటికి తపించడం పాలకులకు పట్టడం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- 'మిషన్ భగీరథ' లో తరచూ అంతరాయం
- నిధులు ఉన్నా జాడలేని మరమ్మతులు
- తాగునీటికి తపిస్తున్న ధర్మపురి పట్టణవాసులు
- తరచూ ఆందోళనలకు దిగుతున్న ప్రజలు



ట్యాంకరు ద్వారా తీసుకొచ్చిన నీటిని పట్టుకుంటున్న పట్టణంలోని ఓ కాలనీకి చెందిన ప్రజలు



ఖాళీ బిందెలతో కౌన్సిలర్ల నిరసన(ఫైల్)

గోదావరిలో స్నానాలు.. నృసింహుని దర్శనాలు..

- వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు నిత్యం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం తరలివస్తున్నారు.
- వీరు తొలుత సమీపంలోని గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.
- అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు.
- పుణ్యక్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం ఇటీవల సుమారు రూ.160 కోట్లు మంజూరు చేసింది.
- బల్దియా ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు దాదాపు రూ.60 కోట్లు వెచ్చించారు.

బోల్‌చెరువు నుంచి సరఫరా నిలిపివేత

- పట్టణవాసుల దాహం తీర్చేందుకు కమలాపూర్ బోల్‌చెరువు వద్ద రూ.12కోట్ల వ్యయంతో ఫిల్టర్‌బెడ్ నిర్మించారు. చెరువు నీటి సామర్థ్యం 8 మిలియన్ లీటర్ల డెలివరీ(ఎంఎల్‌డీ) ఉండేది. మిషన్ భగీరథతో బోల్‌చెరువు నీటి సరఫరా నిలిపి వేశారు. మంత్రి చొరవతో కొంతకాలం నీరు అందించారు. ప్రస్తుతం వేసవికావడంతో చెరువులో నీటిమట్టం తగ్గింది. దీంతో ఆ పథకం నిరుపయోగమైంది.
- పట్టణ తలాపునే ఉన్న గోదావరినది నుంచి గతంలో పైపులైన్ల ద్వారా పట్టణవాసులకు తాగునీరు అందించేవారు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో నిల్వనీటిని తాగేందుకు ప్రజలు ఇష్టపడలేదు. దీంతో ఐదేళ్లుగా ఆ నీటి సరఫరా నిలిపివేశారు.

అయినా, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంలేదు.

నిరుపయోగంగా నీటి ట్యాంకులు..

- మున్సిపాలిటీలో 15వార్డులు, 4,356 నివాసాలు ఉన్నాయి. 2023 జనాభా లెక్కల ప్రకారం బల్దియా జనాభా 20,250గా ఉంది. 5వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఇచ్చారు. పట్టణంలో 16.70 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన 9 వాటర్ ట్యాంకులు నిర్మించారు. అందులో 7 వినియోగిస్తుండగా.. 2 వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. పట్టణ వాసుల అవసరాల కోసం రోజూ సుమారు 33.40 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.

70కి.మీ. పొడవున పైపులైన్..

- మెట్‌పల్లి మండలం ఇబ్రహీంపట్నం సమీప డబ్బా ప్రాంతంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా సుమారు 70.కి.మీ. దూరంలోని ధర్మపురికి పైపులైన్ నిర్మించారు.

బల్దియా సమాచారం	
నివాసాలు	4,356
జనాభా	20,250
నల్లా కనెక్షన్లు	5,000

- మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల మీదుగా నిర్మించిన పైపులైన్ ద్వారా ధర్మపురికి తాగునీరు సరఫరా చేస్తున్నారు.
- ఈ మార్గంలో ఎక్కడ చిన్న సమస్య ఎదురైనా ధర్మపురికి తాగునీటి సరఫరా నిలిచిపోతోంది.
- ప్రధానంగా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట 'టీ' జంక్షన్ వద్ద నీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది.
- ఇలా వారంలో కనీసం రెండుమూడుసార్లు నీటి సమస్య తలెత్తుతోంది.

శాశ్వత పరిష్కారం ఏది?



ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధి అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామని మంత్రి కొప్పుల ఈశ్వర్ చెబుతున్నారు. కానీ, తరచూ తలెత్తే తాగునీటి సమస్యపై ఎందుకు దృష్టి పెట్టడంలేదు? మిషన్ భగీరథ నీళ్లు ప్రజలకు సరిపోవడం లేదు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు

ఇంటింటికీ తాగునీరు



మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లానీరు అందించడానికి సీఎం కేసీఆర్ రూ.వేల కోట్లు వెచ్చించారు. దీనిద్వారా ఇంటింటికీ తాగునీరు చేరుతోంది. ధర్మపురివాసులకు సరఫరా చేసే పైపులైన్లలో ఎక్కడో సాంకేతిక లోపం ఏర్పడి ఉండొచ్చు. దాని శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– కొప్పుల ఈశ్వర్, సాంఘిక సంక్షేమ మంత్రి

ఇబ్బందులు లేకుండా చర్యలు



మిషన్ భగీరథ పథకం ద్వారా బల్దియావాసులకు నిత్యం తాగునీరు అందిస్తున్నాం. మిషన్ భగీరథలో చివరి మండలం కావడంతో డబ్బా నుంచి వచ్చే పైపులైన్లలో తరచూ సాంకేతిక లోపం తలెత్తుతోంది. దాని మరమ్మతు మా పరిధిలోకి రాదు. అయినా, నీటి సరఫరాలో అంతరాయం కలిగితే ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నాం.

– రమేశ్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

- దీనికితోడు మున్సిపాలిటీలో ఏ సమస్య తలెత్తినా అధికారులు చేపట్టే మర్మతులతో మరికొన్ని రోజుల పాటు నీటిసరఫరా నిలిచిపోతోంది.
- ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నా ప్రజావసరాలకు సరిపోవడం లేదు.
- దీంతో ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు తరచూ ప్రత్యక్ష ఆందోళనలు, నిరసనలకు దిగడం పరిపాటిగా మారింది.
- ప్రభుత్వం, పాలకుల తీరుపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న అతిథులు

జగిత్యాల: వైద్య రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక విరూపాక్షి గార్డెన్స్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల అభ్యున్నతికి తొమ్మిదేళ్లలో దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. పల్లెదవాఖానాలు, కేసీఆర్ కిట్లు , అమ్మఒడి పథకం ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చుతున్నారని అన్నారు. జగిత్యాలలో వైద్య కళాశాల ఏర్పాటు, ఆస్పత్రుల విస్తరణ తదితర పనులు చేపట్టామని తెలిపారు. టిఫా స్కానింగ్, టెలిమానస్ సేవలు, రేడియాలజీ ల్యాబ్, తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ లాంటి అత్యాధునిక సేవలను పేదల దరి చేర్చామని వివరించారు. జెడ్పీవైస్‌చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పురుడు పోసుకునే గర్భిణులకు అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. వారి ఆరోగ్యం కోసం న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం వైద్యశాఖలో ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఆర్డీవో మాధురి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శివరాంప్రసాద్, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

16న రంగవల్లుల పోటీలు

జగిత్యాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక మున్సిపల్ పార్క్ ఎదురుగా ఉన్న టౌన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలకు రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుక్కల ముగ్గులు, చుక్కలు లేకుండా ముగ్గులు వేయవచ్చన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీ, తృతీయ బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు టీఎంసీ రజిత, 91103 75351 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కోటిలింగాల అభివృద్ధి లక్ష్యం

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్



ప్రశంస పత్రాలు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



కోటి లింగాలలో రాజగోపురానికి భూమిపూజ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ తదితరులు

వెల్గటూర్(ధర్మపురి): కోటిలింగాల శ్రీకోటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం అభివృద్ధికి మరో ముందడుగు పడింది. మంత్రి కొప్పుల ఈశ్వర్ హామీ మేరకు ఆలయ పునర్నిర్మాణం, ఐదంతస్తుల రాజగోపురం నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. గర్భగుడిని వదిలేసి.. మిగతా ప్రాంతాన్ని తొలగించి ఆలయాన్ని పునర్నిర్మిస్తారు. ఇందులో రాజగోపురం కూడా నిర్మిస్తారు. ఇందుకోసం రూ.2.50 కోట్ల వ్యయంతో మెగా కంపెనీ ప్రభుత్వ సహకారంతో పనులు ప్రారంభించింది. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హరిత హోటల్ నిర్మాణం, గోదావరిలో బోటింగ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కాగా, వడ్డెర కాలనీ యువకులు బీఆర్ఎస్‌లో చేరగా మంత్రి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జెడ్పీటీసీ సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఆలయ ఈవో కాంతారెడ్డి, పదిరె నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులు పేదలకు వరం

ధర్మపురి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.లక్షల విలువైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తున్నామని, వైద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆరోగ్య తెలంగాణ కోసం గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాల్లో రూ.వేల కోట్లు వెచ్చించి ఆధునిక వసతులు కల్పించారని, నిమ్స్, ఎంజీఎం, గాంధీ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఆధునిక హంగులతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు పొందుతున్న వారికి వైద్యఖర్చుల కోసం రూ.5.54 కోట్ల విలువైన ఎల్‌వోసీలు అందించామని అన్నారు. 26,383 మందికి రూ.60 కోట్లకుపైగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించామని పేర్కొన్నారు. అంతకుముందు వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించిన వైద్యులు, సిబ్బందికి జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మకరంద్, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, జిల్లా వైద్యాధికారి శ్రీధర్, డీఆర్డీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై ప్రభుత్వం చిన్నచూపు

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

జగిత్యాలటౌన్: కేవలం పింఛన్లు మంజూరు చేసి మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గొప్పలు చెప్పుకోవడానికేనా దశాబ్ది ఉత్సవాలు అని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి విమర్శించారు. మహిళల హక్కులను కాలరాయడం, రైతులను గోస పెట్టడంలో అగ్రస్థానంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మహిళల గురించి మాట్లాడే హక్కులేదన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగంలో అంబేడ్కర్ మహిళలకు కల్పించిన హక్కులను తెలంగాణ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. బీసీ మహిళకు కేటాయించిన జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ కుర్చీలో ఓసీ పురుషుడిని కూర్చోబెట్టి పాలన సాగించడం ఏమిటని ప్రశ్నించారు. మహిళలకు కేటాయించిన సీట్లలో కూడా మహిళలను కూర్చోనివ్వడం లేదని ధ్వజమెత్తారు. ఇందుకేనా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం అని ఆమె ఎద్దేవా చేశారు. రాష్ట్రప్రభుత్వ ప్రథమ పౌరురాలిని దూషించిన వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారని, ఇదేనా బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చే గౌరవం అని నిలదీశారు. నాయకులు ములస్తం లలిత, అల్లాల సరిత, బింగి సుమ, సంజన, కల్లెపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, గాజుల రాజేందర్, బింగి రవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వికాసానికి భాషే కీలకం

మల్లాపూర్(కోరుట్ల): సామాజిక వికాసానికి రథచక్రాలైన భాష, సాహిత్యాలే కీలకమని ఎన్ఆర్ఐ గంద్ర విద్యాధర్‌రావు అన్నారు. సాతారంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో 'అక్షర సాహిత్య కళాపీఠం' లోగో ఆవిష్కరించారు. అక్షర సాహిత్య కళాపీఠం వ్యవస్థాపకుడు అంకం దామోదర్ రచించిన 'తొలకరి జల్లు' పుస్తకం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ భారతీయులు వృత్తిరీత్యా ఏ దేశంలో స్థిరపడినా.. అవసరానికి మాత్రమే ఆంగ్ల భాష మాట్లాడాలన్నారు. అన్నింటికీ అమ్మ భాషనే వినియోగించాలని చెప్పారు. తెలుగుభాష, తెలంగాణ యాసను బతికించుకోవాలని కోరారు. అనంతరం అక్షర సాహిత్య కళాపీఠం వ్యవస్థాపకుడు అంకం దామోదర్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్, అడ్వకేట్ వేణుగోపాల్‌రావు, పంచాయితీ కార్యదర్శి వినోద్, ప్రధానోపాధ్యాయుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంట పరిహారం కొందరికేనా?

- 59,794 ఎకరాల్లో నష్టం
- 532.36 ఎకరాలకే పరిహారం మంజూరు చేసిన ప్రభుత్వం
- బాధిత రైతుల్లో నిరాశ

కథలాపూర్(వేములవాడ): ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురవడంతో వేలాది ఎకరాల్లో చేతికొచ్చిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పట్లో వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న పంటలు పరిశీలించారు. బాధిత రైతులకు పరామర్శలు, నష్టపోయిన పంటల సర్వేలు అంటూ హడావుడి చేశారు. అయితే, బాధిత రైతులకు సకాలంలో, పూర్తిస్థాయి పరిహారం అందించడంలో విఫలం కావడంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు.

రైతులకు భరోసా కలిగేదెప్పుడో..?

- రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది.



వరి పంట పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకునే విషయంలో నాలుగేళ్లుగా ముందుకురావడంలేదు.
- పంటల బీమా పథకాలు లేకపోవడం, ప్రభుత్వ సాయం అందకపోవడంతో సాగును నమ్ముకొని రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.
- కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలు చేయకపోవడంతో విపత్తుల సమయంలో అన్నదాతలకు భరోసా కలుగడం లేదు.

పంట నష్టం వివరాలు	
పంట	నష్టం(ఎకరాల్లో)
వరి	24,146
నువ్వు	2,566.5
మామిడి	32,722
మొక్కజొన్న	255.5
సజ్జ	104

- పంటల పెట్టుబడికి రైతుబంధు ద్వారా సాయం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పంటలు నష్టపోతే పరిహారం అందించడంపై దృష్టి పెట్టడంలేదు.
- ఈసారి వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లితే.. వందల ఎకరాలకే పరిహారం అందించడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

59,794.4 ఎకరాల్లో పంట నష్టం..

అకాల వర్షాలతో వరి, నువ్వు, మామిడి, మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం జరిగింది. 33 శాతం కంటే అధికంగా నష్టం జరిగితేనే పంటలకు పరిహారం అందుతుందని అధికారులు అంటున్నారు. అప్పట్లో ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులవారీగా పంటల సర్వే చేసి 59,794 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వివరాలు నమోదు చేశారు.

ప్రభుత్వానికి నివేదిక..

- పంట నష్టం వివరాలను నమోదు చేసుకున్న అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.
- ప్రస్తుతం వానకాలం పంటలకు సిద్ధమవుతున్న తరుణంలో బాధిత రైతులకు పరిహారం త్వరగా అందిస్తే కాస్త ఆసరాగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

532.36 ఎకరాలకే పరిహారం..

- జిల్లాలో అకాల వర్షాలతో 59,794.4 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. కానీ 532.36 ఎకరాలకే రూ.53.92 లక్షల పరిహారం మంజూరైంది. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. వరి 75.11 ఎకరాలు, నువ్వు 68.28 ఎకరాలు, మామిడి 386.25 ఎకరాలు, మొక్కజొన్న 2 ఎకరాలకే పరిహారం మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పంటలు నష్టపోయిన అందరికీ పరిహారం ఇవ్వాలంటున్నారు.

పెట్టుబడి పెరిగింది



వడగళ్లు, అకాల వర్షాలకు పంటలు నష్టపోతే రైతులను ఆదుకోవడం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత. సాగుకు పెట్టుబడి పెరిగింది. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.20 వేలు పరిహారం చెల్లించాలి. పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం చెల్లించాలి.

– నరెళ్ల రవీందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా నాయకుడు

రూ.53.92 లక్షలు మంజూరు



అకాల వర్షాలతో 59,794 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు ప్రభుత్వానికి నివేదించాం. 532.36 ఎకరాలకు రూ.53.92 లక్షల పరిహారం మంజూరైంది. ఏ పంటలకైనా ఒక్కో ఎకరాకి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

'లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తాం'

మెట్‌పల్లి(కోరుట్ల): దశాబ్ది ఉత్సవాల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలకు సాధారణ నిధులు రూ.10లక్షలను వినియోగించడం సరికాదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్‌తోపాటు ఇల్లెందుల రాజు, దాసరి నరేశ్, కంభ సురేశ్, యెల్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ ఏర్పాటు అభినందనీయం

జగిత్యాల: అంబులెన్స్‌లు ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడతాయని, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వాటిని ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఆర్డీవో మాధురి, అదనపు కలెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వ్యాపారాన్ని అడ్డుకోవాలి

రాయికల్(జగిత్యాల): ఆన్‌లైన్ వ్యాపారానికి చెక్‌పెట్టేలా సెల్ పాయింట్ యజమానులు ముందుకు సాగాలని సెల్ పాయింట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెల్‌పాయింట్ యూనియన్ సభ్యులు ఐక్యంగా ఉంటూ వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారాలకు అంతరాయం కలిగిస్తున్న వారిని ఎదుర్కొనేందుకు ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. సెల్‌పాయింట్ యూనియన్ మండల అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ధర్మపురి అధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి, మేడిపల్లి అధ్యక్షుడు ఇర్ఫాన్, మెట్‌పల్లి అధ్యక్షుడు రాకేశ్, కోరుట్ల అధ్యక్షుడు రమణ, మల్యాల అధ్యక్షుడు మహేశ్, గొల్లపల్లి మండల అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

గోదావరిఖని : రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందిన సంఘటన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోదావరిఖనిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పల్లెపు శేషాద్రి పనినిమిత్తం బుధవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై స్నేహితుడు సాయికిరణ్‌తో మంచిర్యాలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గోదావరిఖని బస్టాండ్ సమీపం వద్దకు రాగానే బయట గేటు వద్ద సిమెంటు దిమ్మెను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శేషాద్రి, సాయికిరణ్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా శేషాద్రి మృతిచెందాడు. సాయికిరణ్ హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

సాగు 'ముందుకు' సాధ్యమేనా?

- పంట కాలం ముందుకు జరిపితే..
- దిగుబడులపై ప్రభావం.. తెగుళ్ల బెడద
- నెమ్మదించనున్న వ్యవసాయ పనులు
- శాస్త్రవేత్తలు, రైతుల్లో ఆందోళన


ఇటిక్యాలలో వరి నారు చల్లుతున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: ఏటా యాసంగిలో వడగళ్లు, అకాలవర్షాతో పంటలు దెబ్బతింటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని పంట కాలాన్ని ముందుకు జరపాలని ప్రభుత్వం యత్నిస్తోంది. అయితే, జిల్లాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడంలేదు. యాసంగి పంట కాలాన్ని ముందుకు జరపాలంటే.. జూన్‌లో ప్రారంభమయ్యే వానాకాలం సీజన్‌ను కూడా ముందుకు జరపాల్సి ఉంటుంది. జూన్ మొదటివారంలోనే వానాకాలం సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటివరకు ఒక్కవర్షపు చుక్క కూడా పడలేదు. దీంతో పంటకాలం ముందుకు జరపడం ప్రశ్నార్థకంగా మారింది.

జూన్ చివరలోనే వర్షాలు..

- వానాకాలంలో నైరుతి రుతుపవనాల ద్వారానే వర్షం కురుస్తోంది.
- గతంలో జూన్ 5 నుంచి 6వ తేదీ వరకు రుతుపవనాల రాకతో వర్షాలు కురిశాయి.
- కొన్నేళ్లనుంచి జూన్ 20వ తేదీ తర్వాతే వానలు కురవడం ప్రారంభమవుతోందని పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- వానాకాలం పంటల సీజన్ జూలై చివరి వరకూ కొనసాగుతుంది.
- ఈసారి జూన్ 15 సమీపించినా వర్షాల జాడ లేదు.
- వాతావరణంలో మార్పులతో బలమైన ఈదురుగాలులు మినహా వానచుక్క కురవడంలేదు.
- ఉష్ణోగ్రతలు తగ్గాల్సింది పోయి గరిష్టస్థాయిలో నమోదు అవుతున్నాయి.
- వ్యవసాయబావులు, ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో ఉన్న నీటితో పంటలు పండించే పరిస్థితులు లేవని అంటున్నారు.
- ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్ ఇప్పటికీ ప్రారంభం కాలేదు,
- తద్వారా పంట కాలాన్ని ఎలా ముందుకు జరుపుతారనే ప్రశ్న తలెత్తుతోంది.

70 మి.మీ. వర్షపాతం నమోదైతేనే సాగు

సకాలంలో వర్షాలు కురవకపోతే వానాకాలంలో పంటలు పండించడం ఇబ్బందిగా మారుతుందని రైతులు చెబుతున్నారు. బావుల్లో ప్రస్తుతం ఉన్ననీటి నిలల్వలతో వరినార్లు పోసినా.. నాట్లు వేయడం కష్టంగా మారుతుంది. నాట్లు వేసే సమయానికి సాగునీటి కొరతతో ప్రధాన పొలం సిద్ధం చేయడం కష్టమవుతుంది. వర్షాలు కురిసేవరకు ఆగితే నారు ముదిరిపోయే ప్రమాదం ఉంది. దాదాపు 60మి.మీ. నుంచి 70 మి.మీ. వర్షపాతం నమోదైతేనే మొక్కజొన్న, కంది, పెసర వంటి విత్తనాలు నేలలో చల్లుకుంటే బాగా నాని మొలకెత్తుతాయని వ్యవసాయ శాఖ ప్రచారం చేస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో విత్తనాలు వేస్తే మొలకెత్తవని, రైతులు నష్టపోతారని చెబుతున్నారు. ఈసీజన్ ఆలస్యమైన కొద్దీ.. దీని ప్రభావం యాసంగి సీజన్‌పై పడుతుందని, ఆ సీజన్ ముందుకు జరగడం ఏమోకానీ, మరింత వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

శాస్త్రవేత్తలు ఏమంటున్నారంటే..

- వర్షాధార వ్యవసాయంలో పంట కాలాన్ని ముందుకు జరపడం సాధ్యం కాదు.
- వాస్తవంగా యాసంగి సీజన్ ఫిబ్రవరి, మార్చిలో అకాల వర్షాలు కురస్తాయి.
- వాటితో పంటలకు నష్టం ఏమీలేదు. కానీ, ఏప్రిల్, మేలో అకాల వర్షాలు కురిస్తే వరి పంట దెబ్బతింటుంది.
- మరోవైపు.. యాసంగి పంటకు డిసెంబర్‌లోనే వరినారు పోసుకుంటారు.
- దీనిని నవంబర్‌కు మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.
- వానాకాలం పంట కోతలు పూర్తయి, యాసంగి కోసం పొలం దున్ని, నాట్లు వేసే సమయం డిసెంబర్ వరకూ కొనసాగుతుంది.
- నవంబర్‌లో నార్లు పోస్తే, చలికి విత్తనాలు సరిగ్గా మొలకెత్తవు. పంటకాలం పెరుగుతుంది.
- చలితీవ్రతతో పురుగులు, తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది.
- చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో దిగుబడులు ఆశించినంత రావు.
- అదే, నవంబర్‌కు బదులు డిసెంబర్‌లో నార్లు పోసి, జనవరిలో నాట్లు వేస్తే పొడి వాతావరణం, ఉష్ణోగ్రతలు పెరగడంతో దిగుబడులు అధికంగా వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సాగు కష్టమే



వర్షాధారిత వ్యవసాయంలో పంట కాలాన్ని ముందుకు జరపడం కష్టమే. వర్షాలపైనే పంటలు పండించే అవకాశం ఉంటుంది కాబట్టి ఎప్పుడు వర్షాలు కురుస్తాయో, ఎప్పుడు కురవవో చెప్పలేం. ఇప్పటికే జూన్ మొదటివారంలో పడే వర్షాలు.. ఇంకా కురుస్తలెవ్వు. వానాకాలం సాగే రైతులకు కష్టంగా మారింది.

– వెల్ముల రాంరెడ్డి, అభ్యుదయ రైతు, పూడూరు, కొడిమ్యాల

ముందుకు జరపడం అసాధ్యం



పంట కాలాన్ని ముందుకు జరపడం సాధ్యమయ్యే పనికాదు. వాతావరణంలో ఎలాంటి మార్పులు జరుగుతాయో మనం చెప్పలేం. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో ఇంకా వర్షాలు కురవలేదు, వానాకాలం సీజన్‌లో సాగు చేసే పంటలే డిసెంబర్‌లో కోతకు వచ్చే అవకాశం ఉంది. యాసంగి సీజన్‌ను ముందుకు జరపడం కుదరదు.

– కిషన్‌రెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం మాజీ డైరెక్టర్, పొలాస

అందరికీ ఓటుహక్కు కల్పించాలి

- అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి
- ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్


కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని, ఇదేసమయంలో ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలను పర్యవేక్షించేందుకు ఎన్నికల కమిషన్ ఈనెల 23న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తుందన్నారు. పూర్తి సమాచారంతో సిద్ధం కావాలని ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించేలా రెండోవిడత ఓటరు జాబితా పూర్తి చేయాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనలో సర్వీస్ ఓటర్లు, తొలగించిన ఓటర్లు, క్షేత్రస్థాయి ధ్రువీకరణ, నూతన ఓటర్లకు ఓటరుకార్డుల పంపిణీపై దృష్టి సారించాలని అన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్ లత, ఆర్డీవోలు మాధురి, వినోద్‌కుమార్, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి రంగంపై జీవన్‌రెడ్డి తప్పుడు ప్రచారం

- ఇథనాల్ పరిశ్రమతో ముప్పు ఉంటే ముక్కు నేలకు రాస్తా
- మంత్రి కొప్పుల ఈశ్వర్


మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: సాగునీటి రంగంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమపై ముప్పుంటే ముక్కు నేలకు రాస్తానని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్ట్‌లు, చెరువులు, తూములు, చెక్‌డ్యామ్‌లు, కాళేశ్వరం ప్రాజెక్టుపై జీవన్‌రెడ్డి అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 20 మండలాలు ఉన్నాయని, ఏ మండలంలో పంటలు ఎండిపోయాయో చూపించాలని సవాల్ చేశారు. ఏ చెరువులోనైనా నీరు లేదో దానిని జీవన్‌రెడ్డి చూపించాలన్నారు. రోళ్లవాగు ద్వారా నెల రోజుల్లో 20 వేల ఎకరాలకు నీరు అందిస్తామని తెలిపారు. రైతుల ఆత్మహత్యలను జీవన్‌రెడ్డి కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయ లబ్ధికోసం అమాయకులను బలిచేయడం సమంజసం కాదని హితవు పలికారు. ఆయన వెంట ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

పెగడపల్లి(ధర్మపురి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నామాపూర్ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టే నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనేకపేళ్ల క్రితం నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలకు గత ప్రభుత్వాలు మరమ్మతులు కూడా విస్మరించాయన్నారు. శిథిలావస్థలోని భవనాలను తొలగించి కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిందని తెలిపారు. అంతకుముందుగా ఎల్లాపూర్‌లో పంక్షన్ హాల్ ప్రారంభించారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, సర్పంచులు కరుణాకర్‌రెడ్డి, అంజమ్మ, ఎంపీటీసీ రజిత, ఉప సర్పంచులు సంతోష్, గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే సంజయ్


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: తిప్పన్నపేట గ్రామానికి చెందిన బండ వంశీ బుధవారం సాయంత్రం జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై సుమంగళి గార్డెన్స్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బాధితుడిని చూశారు. తన వాహనాన్ని ఆపి తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి వద్దకు వెళ్లారు. ప్రత్యేకంగా ఆటో సమకూర్చారు. స్థానికులతో కలిసి వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మానవత్వం చాటిన ఎమ్మెల్యేను పలువురు అభినందించారు.

'నీట్'లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రభంజనం


మార్కులు సాధించిన విద్యార్థులతో డా.నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): నీట్– 2023 ఫలితాల్లో అల్ఫోర్స్ నీట్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జి.సంతోషిని 619 మార్కులు, డి.ఆదిత్యచంద్రకాంత్‌రెడ్డి 615, ఎస్.ధిరణ్‌కుమార్ 610, కె. ప్రణితరెడ్డి 610, జి.జ్యోతి 600, బి.శ్రీగోధ 594, డి. అశ్వితరెడ్డి 588, సయ్యద్ అతిభవుర్ రహమాన్ 583, టి.దీపిక 571, సాయిసదిష్ట 570, కె.అలేఖ్యరెడ్డి 564, నబిహ 558, బి.విద్యాలక్ష్మి 550, స్నేహమాలిక్ 550, బి.ప్రణయ్ 549, రువైఫ ఫాతిమా 537, ఎన్.అనూష 537, డి.వర్షిణి 533, సీహెచ్.పార్థివ్ ఖాండిన్య 533, ఆర్.స్నిఖిత 529, కె.హారిక 529, ఎస్.చందన 527, సీహెచ్.శ్రీవేదార్పిత 527, శ్రేషిత 523, ముస్కాన్‌తభస్సుమ్ 521, బి.శ్రీనిధి 520, ఫాయేజాఅంజుమ్ 518, ఎ.అక్షిత 516, సాయివిఘ్నేష్ 515, ఎ.మానస 514, వి.శైలేష్ 513, ఎన్.అభినయ 511, ఎ.హరిచరణ్ 506, కె.శ్రీఫణి 505, ఎ.అద్వైతవర్షిణి 503 మార్కులతో రాణించినట్లు విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీ టాట్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించారు. ఐదుగురు 600పై మార్కులు, 36 మంది 550పై, 55 మంది 450పై మార్కులు సాధించారని, సుమారు 80 మంది వి ద్యార్థులు ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించగలరని తెలిపారు.

నీట్ ఫలితాల్లో ట్రినిటీ ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి కళాశాల యాజమాన్యం

కరీంనగర్: నీట్ ఫలితాల్లో ట్రినిటీ కళాశాలలు పెద్దపల్లి, కరీంనగర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. టీ45 బ్యాచ్ నుంచి 20 మంది తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల్లో సీట్లు సొంతం చేసుకున్నారని వివరించారు. ఫలితాల్లో ఎ.సంధ్యారాణి 628 మార్కులు, కె.ఐశ్వర్య 605 , ఎస్.కార్తికేయ 578 , టి.అవినాశ్ కుమార్ 531, ఎ.మల్లికార్జున్ 530, ఎ.మహేందర్ 527, ఎ.భార్గవి 524 , వి.అర్పిత 523 , ఎం. రేఖ 492 , ఎ.శివవర్ష 488 , హరికృష్ణ 484, ఎండీ అబ్దుల్ ముజీబ్ 478 , బి.సిరి 468 , ఆర్. వంశీకృష్ణ 466 , ఎం. నిత్య 463, బి.దీపక్ 455, ఎన్. కార్తీక్ 453 , ఆర్.అలేహ్య 449, కె.లిఖిత 438, సీహెచ్ వైష్ణవి 430, కె.దివ్యసాయి 427, కె.కిరణ్ 427, ఎస్.మనీషా 423 , సరీశ్ ఐమన్ 421 , జి.శరున్ 421 , సుస్మితాగ్రేస్ 420, ఆర్. శైలజ 419 , వై.అశ్లేష 418, బి.నివేదిత 417, బి.దీపక్ లాల్ 412, సాయి మోక్షిత్ రెడ్డి 402 మార్కులు సాధించారు. లాంగ్ టర్మ్ బ్యాచ్ ఈనెల 14 నుంచి ప్రారంభమైనట్లు తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధ్యాపక బృందాన్ని ఫౌండర్ చైర్మన్ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న రమేశ్‌రెడ్డి, యాజమాన్యం

కరీంనగర్: నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించారు. బానోతు దినేష్‌నాయక్ 425, ఆర్.హరికృష్ణ 1169, ఎస్.స్వాతి 1755తో జాతీయ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల అధినేత ఎం.రమేశ్‌రెడ్డి తెలిపారు. ఎం నందిని 609 మార్కులు, తాటి కావ్యశ్రీ 580, డి.కార్తీక్ 554,, బి.సాయివినీత్ 545, డింపుల్ జెస్టినా 541, ఎ.కీర్తన 533, సుద్దాల శ్రీనివాస్ 492, వి.అఖిల 491, మేముల శ్రీజ 466, ఎం. కృష్ణతేజ 459, ఎన్.స్వాతి 458, ఎస్.జెస్వీందర్‌కౌర్ 452, పాదం యశ్వంత్ 447, కె. ఆదిత్య 445, హుస్సేన్ 438, కె.అర్జున్ 437, ఎస్.అనిల్ 437, సిహెచ్ చందన 435, కె. సాయికిరణ్ 427, వి.మధుకర్ 414, ఐ.రమణిరెడ్డి 411 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యున్నత ఫలితాలతో ఉత్తర తెలంగాణలో అగ్రగామిగా నిలుస్తున్నారని వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

అయ్యో.. బిడ్డలారా..

- మానేరులో ఈతకు వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి
- కళ్లముందే చనిపోవడంతో విలపించిన కుటుంబసభ్యులు
- మృతులది జమ్మికుంట మండలం తనుగుల
- ఓదెల మండలం పొత్కపల్లి వద్ద ఘటన
- వేసవి సెలవులకు వీణవంక మండలం కొండపాకకు..
- మూడు గ్రామాల్లో విషాదం


చెక్‌డ్యాం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఓదెల/వీణవంక/జమ్మికుంట: వేసవి సెలవుల కోసం బంధువుల ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు మానేరువాగులో మునిగి మృత్యువాత పడడం స్థానికంగా విషాదం నింపింది. వీణవంక మండలం కొండపాక చెక్‌డ్యాం, పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లి చెక్‌డ్యాం సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో మూడు గ్రామాల ప్రజలను కలచివేసింది. జమ్మికుంట మండలం తనుగులకు చెందిన జూపాక అశోక్, భాగ్యలక్ష్మి కూతురు సింధు, సాత్విక్(13)సంతానం. అదే గ్రామానికి చెందిన కాసర్ల సునీల్, వందనకు కూతురు నిత్య(12) కుమారుడు ధామన్ సంతానం. వేసవి సెలవుల కోసం మూడు రోజుల క్రితం కొండపాకలోని సంపత్ ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం కొండపాక శివారులోని చెక్‌డ్యాంలో స్నానం చేద్దామని వెళ్లారు. నిత్య, సాత్విక్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగారు.

చదువులో ఇద్దరూ ముందంజ..

సాత్విక్ తనుగుల ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదివి ఆరో తరగతి కోసం ఇటీవల జరిగిన సోషల్ వెల్ఫేర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. నిత్య హుజూరాబాద్‌లోని బీసీ వెల్ఫేర్‌లో ఏడో తరగతి చదువుతోంది. ఇద్దరూ చదువులో చురుగ్గా ఉండేవాళ్లని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తహసీల్దార్ రాజయ్య, ఎస్సై శేఖర్‌రెడ్డి, బ్లూకోల్ట్స్ సిబ్బంది రాజబాబు చిన్నారుల మృతదేహాలను బయటకు తీసేందుకు కృషి చేశారు. జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సంతాపం

సాత్విక్, నిత్య మృతి చెందడంపై హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కే వీరస్వామిగౌడ్, సర్పంచ్ చిలుముల వసంత, ఎంపీటీసీ వాసాల నిరోష తదితరులు సంతాపం తెలిపారు.


నిత్య, సాత్విక్(ఫైల్)

డేంజర్‌గా జోన్‌గా మానేరు

పొత్కపల్లి వద్ద మానేరు వాగు డేంజర్‌జోన్‌గా మారింది. నెల రోజుల క్రితం ఇక్కడే ఓ చిన్నారి కూడా ఈతకోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా ఇద్దరు చనిపోయారు. పొత్కపల్లి మానేరు చుట్టు గ్రామాలైన వీణవంక, కోర్కల్, కొండపాక, మడక, కనగర్తి, మల్లారెడ్డిపల్లె, కల్లుపల్లె ప్రజలు మానేరులో ఈత కొట్టేందుకు వస్తుంటారు. మానేరులో చెక్‌డ్యాంల నిర్మాణాల కోసం ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలతో లోతైన గోతులు ఏర్పడ్డాయి. అవి నీటితో నిండిపోవడంతో చిన్నారులకు లోతు తెలియక మునిగిపోతున్నారు. మే 22న జీలకుంటలో జరిగిన భూలక్ష్మి ఉత్సవాలకు వచ్చిన వరంగల్ జిల్లా టేకుమట్ల మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన పింగిళి సదాశివరెడ్డి(24) ఇక్కడే మృతిచెందాడు. నెల తిరగకముందే సాత్విక్, నిత్య మానేరులో మునిగి మృతిచెందారు. ప్రమాదాలు జరగకుండా మానేరు చుట్టూ రక్షణ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.